# గణింపు - గుణింపు ★

రచయిత:
శ్రీ యర్రమిల్లి చలపతిరావు

సుబ్బయ్యశ్రేష్ఠిగారు ఆకస్మికంగా కాలధర్మం చేశారంటే అందరితోపాటూ నాకూ ఆశ్చర్యం, విచారం కలగకపోలేదు మొదట. మొదట్లో చాలా ఆశ్చర్యపోయాను. కాని కొద్ది నిముషాలకే, సర్వసామాన్యమైన, యెవరూ తప్పించుకోలేని యీ సంఘటనకు ఆశ్చర్యమెందుకని నాలో నేనే సమాధాన పడ్డాను.

పాపం! ఎంత లేదన్నా చావు, చావే కదండీ? "చచ్చినవాడికళ్లు చారెడేసి" అన్న సామెతప్రకారం, ఏమనిషి మంచిచెడ్డలైనా, పేరుప్రతిష్ఠలైనా అతడు బ్రతికిఉండగా అంతగా రాణించవు. లెఖ్ఖలోకి రావు గూడా. ఆవ్యక్తి చచ్చి, స్వర్గానికో నరకానికో వెళ్లిన అనంతరం, ఆవ్యక్తి మంచిచెడ్డల్ని గురించి, "ఫలానా వ్యక్తి యిలాంటి వాడురా!" అని లోకం చెప్పుకుని ఆనందించుకుంటుంది.

బ్రతికిఉండగా త్రాగటానికి గంజిఅయినా లేక మలమలమాడిపోయినాసరే, తనకు అవసరంలేని లోకం, ఆ మనిషి చచ్చిన తరువాత అతను పడ్డ కష్టాల్నిగురించిగాని, సుఖాల్ని గురించిగాని, గుణగణాలను గురించి కాని, నోటినెప్పితీరేలా చెప్పుకుని సంతృప్తిపడుతుంది. ఇంతకీ ఆ చచ్చినవాడు దరిద్రుడే అయితే, ఆనిర్భాగ్యుడి యింటిప్రక్కవాళ్లకే తెలీదు వాడి చావు. చచ్చినా, బ్రతికినా, కాస్త ఇన్ని పిక్కలున్న వాణ్ణిగురించే చెప్పుకుంటుంది లోకం. వెధవలోకం? ఆ చెప్పుకోవడంలో గూడా పక్షపాతమే. అన్నీ అబద్ధాలే. గోరంతలు కొండంతలుగా వర్ణించి ఆ చచ్చినవెధవకి వాడు నిజంగా అప్రాచ్యుడయినాసరే, మహాపురుషత్వాన్ని ఆపాదిస్తుంది. అది దాని నైజమేమో? లేక స్వార్థమా? ఏదో ఒకటి! ఏదయితే మనకేం? మనకథ వెనక్కుపోతోంది. ఇక తర్కాన్ని విరమించి దీని సంగతి ఏమిటో చూద్దాం.

లక్షాధికారి అయిన సుబ్బయ్యశెట్టిగారంటే వైశ్యపుంగవులని పేరునుబట్టే తెలుస్తోంది. అయితే, ఆయనపుట్టడంతోటే, లక్షలన్నీకూడా బొడ్డున కట్టుకొని పుట్టాడనుకుంటారేమో? అది వట్టి పొరపాటు. ఆయనకూడా అందరిలాగే దిసమొలతోనే అవతరించాడీ మానవలోకంలో. అయితే అందరిలాగే పుట్టిన ఆయన మనందరిలాగే గాకుండా లక్షలకధికారి ఎలా అయాడంటారేమో? అదీ నిజమే! ఒకానొకప్పుడు చింతపండు ఉండలు పిసికే ఆయన యీనాటికి లక్షాధికారి అయాడు. ఒక్కసారి ఆయనకూడా లక్షాధికారి కాలేదు. అలా యెవరూ కూడా కాలేరేమో?

సుబ్బయ్యశెట్టితల్లిదండ్రులు చిన్నతనంలోనే గతించడంవల్ల ఆయనకు లోకజ్ఞానం వచ్చినప్పట్నుంచీకూడా ఒంటరిగానే తన కాళ్ళమీద తను నిలబడే బ్రతకవలసి వచ్చింది. మొదట్లో ఒక సాహుకారు కొట్లో సరుకులు అమ్మడానికి నెలకు ఆరు రూపాయల జీతం మీద కుదిరాడు. అలా నాలుగైదు సంవత్సరాలు చేసి క్లుప్తంగా గడుపుకుని ఎలాగో ఓ యాభై రూపాయల సొమ్ము మిగుల్చుకున్నాడు. తరువాత తనేస్వంతంగా ఓచిన్నకిరాణా కొట్టు పెట్టుకొని వ్యాపారం సాగించేడు. ఉప్పూ, పప్పూ, ఉల్లిపాయ, మిరపకాయ, నూనీ, ఆముదం, పసుపూ, కుంకం మొదలైన మంగళకర వస్తుసముదాయంతో ఆ దిబ్బమీద, ఆ చింకితాటాకు పందిరిక్రింద, గోచీ పెట్టుకుని దుకాణం మధ్య కూర్చుని అమ్ముకునేవాడు సుబ్బయ్య చిన్నతనంలో. క్రమంగా పదిసంవత్సరాలు గడచేటప్పటికి, ఆ చింకితాటాకు పందిరిస్థానే, దివ్య సుందర భవనంలాంటి ఓ బంగాళా పెంకుటిల్లు వెలిసింది. అంటే యాభైరూపాయల పెట్టుబడితో ప్రారంభించిన సుబ్బయ్యశెట్టి వ్యాపారం, వేలల్లోకి వచ్చిందన్నమాట. అయితే పదిసంవత్సరాలకల్లా సుబ్బయ్యశెట్టి వ్యాపారం, యాభైలోంచి, వేలసంఖ్యల్లోకి వచ్చింది గదా, అతనిలో ఏమైనా మార్పు వచ్చిందా అంటే యేమీలేదు. అతనికి పదేళ్ళక్రితంవున్న గోచీపోయి, దానిస్థానే మూడు మూరల అంగవస్త్రం మాత్రం వచ్చింది. అతని వ్యక్తిత్వంలో ఆ పదేళ్లలోనూ వచ్చిన స్వల్ప మార్పు అది ఒక్కటే. తిండి మునుపటికీ, ఇప్పటికీ వకటే. అంటే యాభైరూపాయల విలువగల మనిషి, పదేళ్లనాటికి యాభైవేల రూపాయల మనిషి అయాడేగాని, అతని జీవన ప్రమాణం మాత్రం ఏమాత్రం పెరగలేదు. అతనికి వండేవారూ, వార్చేవారూ ఎవరూ లేనందువల్ల, చీకటితోనేలేచి తవ్వెడుబియ్యం కుంపటిమీద అత్తెసరు పేశేశే వాడు. పొరుగింటి కమ్మవారింట్లో, కానీ మజ్జిగ పుచ్చుకొనేవాడు. అనంతరం దమ్మిడీ ఖరీదుగల చింతపండువుండ పిసికి, దానిలో ఇంత ఉప్పూ, రెండు ఉల్లిపాయముక్కలూ, నాలుగు పచ్చిమిరపకాయిముక్కలూ త్రుంచి పడేసేసరికి అది ఒకటోరకం అమృతంలాంటి పచ్చిపులుసుగా తయారై ఊరుకొనేది. ఆ మూడుకాన్లు విలువగల పచ్చిపులుసూ, ఆ కానీ మజ్జిగా ఆ రోజుల్లో అర్థణా ఖరీదుగల పొరపాటు? అణా ఖరీదుగల తవ్వెడుబియ్యం మొత్తం తన స్వంతఖర్చు రోజు 1.కి రెండణాల చొప్పున చేసేవాడు. వ్యాపారం కూడా క్రమంగా మాంచి షైల్ లోకొచ్చేసరికి అతని వయస్సుకూడా 28 దాటింది.

తప్పించుకుందామన్నా తప్పని పెద్దఖర్చు ఇంకోటి శెట్టితలపై పడింది. అది సామాన్యంగా ప్రపంచంలో యెవడికీ, తప్పనిసరి అయిన ఖర్చు అవడంవల్ల అతడికీ తప్పిందికాదు. ఏమాత్రం అవకాశం ఉన్నా అదీ తప్పించుకునేవాడే సుబ్బయ్య. ఏమిటా ఖర్చు అంటా

లేమో? అదే పెళ్ళి. ఎలాగైతేనేం, అతనికీ ఇరవైయెనిమిదోఏడు ప్రవేశించబోయేసరికి, అతని వ్యాపారంకూడా, పిచ్చ కుంచాల్తోటీ, తప్పుతూనకాల్తోటీ, యాభై వేలయేసరికీ, "పిల్లనిస్తాం" అంటూ వచ్చాడు పెళ్ళిళ్ళ పేరయ్య. సుబ్బయ్య ఆలోచించాడు. అమ్మో? పెళ్ళే? అనుకున్నాడు మొదట. పెళ్ళంటే మాటలతోడనా? పెళ్లయిన మర్నాటినుంచీ పెళ్ళానికి మూడుపూటలా, దివ్యాన్నాలూ, దుకూలవస్త్రాలూ, దివ్యాభరణభూషణాలూ కావాలి. అందులోనూ పూర్వం రోజులు కావు. మానవుడికి అవసరంలేని యెన్నో అలవాట్లని కోరి తెచ్చిపెట్టుకుని అంతులేని కోరికలతో, వృథాఖర్చుతో మానవులే మానవత్వం కోల్పోతున్నారు. ఇప్పుడున్న ఫ్యాషన్లుకూడా మొఖానికి పసుపు రాసుకుని ఏ సంసారీ చక్కగా ఇంత అర్ధణా కాసంత కుంకుమబొట్టు పెట్టుకోవడంలేదే? ఏవో పౌడర్లుట, స్నోలట, వాసనతలనూనెలట? శాండల్ వుడ్ సబ్బులట? అనుకున్నాడు సుబ్బయ్య. అంతులేనిభయం ముంచుకొచ్చింది. ఏమాత్రం అయినా తప్పుతుందేమోనని చూశాడు. కాని లాభంలేకపోయింది.

ఎలాగైతేనేం తప్పనిసరిగా బొగ్గుల్లో రామచిలుకలాంటి పట్నవాసపుపిల్లను, మహావైభవంగా, అంటే, ముప్పావలా అర్ధణా ఖర్చుతో, అన్నవరం కొండమీద పెళ్ళిచేసుకున్నాడు సుబ్బయ్యశెట్టి.

క్రమంగా మళ్ళీ పది సంవత్సరాలు గడచాయి. వర్తకులపాలిట పెద్ద పండుగలాగా, యుద్ధం వచ్చిపడింది. దాంతో దిగుమతులు బంద్ అయిపోయి ఉన్నవస్తువుల ధరలు ఒకరెట్టుకి రెండురెట్లూ, రెండు రెట్లనుంచి ఒక్కసారి ఎనిమిదిరెట్లూ అయిపోయి ధరల బుడగ, ఒక్కసారి ఆకాశంలోకి యెగిరిపోయింది. దాంతో సుబ్బయ్యశెట్టిబొజ్జ పిప్పళ్ల బస్తాల్లాగా పెరిగిపోయింది. సుబ్బయ్యశెట్టి బొజ్జలాగే, వస్తువుల ధరలుకూడా విపరీతంగా పెరిగిపోవడంవల్ల, అంతటితో సుబ్బయ్య వ్యాపారం వేలసంఖ్యని త్రోసిరాజని, 'ల' కారంలో పడింది. ఆబంగాళాపెంకు ఇంటికి ముందుగా, చక్కని రేడియో, పేటన్ డాబా వెలిసింది. ఐతే సుబ్బయ్యశెట్టి వ్యాపారం, 'ల'కారంలోపడ్డా, అతని జీవన ప్రమాణం యేమాత్రం పెరగలా. ఆ మామూలు మూడు మూరల అంగవస్త్రంగుడ్డా, ఆ అత్తెసరు మెతుకులూ, ఆ పచ్చిపులుసూ, ఎప్పుడైనా అంటే పెళ్ళిఅయిన దగ్గర్నుంచీ, ఏ పక్షిగాడో, చూట్టాన్నంటూ వస్తున్నాడు గనుక, ఓ డబ్బాడు కందిగుండ కొట్టించి యింట్లో పడేశాడు. అదే యేచుట్టంవచ్చినా, పంచభక్ష్య పరమాన్నాలూనూ. అనంతరం కొద్దిరోజులకే భార్య కాపరానికి వచ్చింది. ఆమె కూడా ప్రతి విషయంలోనూ అక్షరాలా భర్తను అనుసరించే సులక్షణాలు గల భారతనారి కావడంవల్ల, సుబ్బయ్యశెట్టి వ్యాపారం, సంసారం ఎంతోసాఫీగా నడిచిపోసాగింది.

సుబ్బయ్యశెట్టి వ్యాపారం, యుద్ధకాలంలో, లక్షదాటి అప్రతిహతవేగంతో పురోగమింపసాగింది యూరప్‌లోని జర్మన్ సైన్యాలకుమల్లే. చూస్తూండగానే సుబ్బయ్యశెట్టి భార్య చేతులకి నాలుగేసి జతల రేడియో గాజులూ, మెళ్లో కాసులపేరూ, జిగినీ గొలుసూ, శంఖాలహారమూ, చంద్రహారమూ మొలకి దానిమ్మగింజరంగు ఎర్రపొళ్ళచమ్కీ వడ్డాణమూ, కాళ్ళకి రెండేసి వీసెల బరువుగల కడియాలూ, గొలుసులూ, తెరమీద కాస్టింగ్ లాగా వరుసగా ఒకదాని తరవాత ఒకటి చొప్పున వెలిసాయి. బెనారస్ చెట్ల చీర కట్టుకుని పైన చెప్పబడిన సర్వాభరణాలూ ధరించి కిరాణా కొట్టుగుమ్మందగ్గిర కూర్చునే సుబ్బయ్యశెట్టిగారి భార్యా తిలకాన్నిచూస్తే, కాంద్రకోట గుళ్లోని "నూకాలమ్మ" విగ్రహం అక్షరాలాజ్ఞాపకంవచ్చేది.

అయితే శెట్టిగారిపెళ్లానికి ఇన్ని నగలున్నాయి. ఇంతంత విలువగల చీరెలున్నాయి కాని శెట్టిగారిలో మాత్రం యుద్ధంవచ్చినాసరే ఏమీ మార్పు కనబడదు. ఆయన వయస్సు ప్రస్తుతంలో నలభై రెండు నడుస్తున్నా ఆయన వ్యాపారం లక్షల్లోంచి పరుగెత్తుతున్నా, ఆయన ముడ్డిమీద మూడు మూరల అంగోస్త్రంమటుకు అలానే అంటిపెట్టుకునివుంది. ఆయన యీ నలభై రెండేళ్ల జీవితంలోనూ, అప్పట్లో గజం మూడు అణాలన్నర ఖరీదు అయిన "బాణంమార్కు" సైనుగుడ్డన్నా ఒక చొక్కా కుట్టించుకుని తొడుక్కోలేదు. ఆయనకు సినీమాలన్నా నాటకాలన్నా అసహ్యం. అవి చూసినవాళ్లు షోకికీవాళ్లు అయిపోతారుట. వినోదమన్నా, విజ్ఞానమన్నా ఏమిటో తెలీదు. వార్తాపత్రికలన్నా, రేడియోలన్నా తలనొప్పి.

పోనీ, కడుపునిండా, కావలసిన రుచులేనా, కమ్మగా తిన్నాడా? మానవజన్మం యెత్తినందుకు? ఊహు. కందిగుండా, పెసరగుండా, పచ్చిపులుసూ, యివి మూడే శెట్టిగారికి నిత్యనైవేద్యాలు. కమ్మగా ఇంతకంది పప్పువేసుకుని, గోనెట్లో పులిసిడు నెయ్యి ఎప్పుడూ వేసుకున్న పాపాన్నిపోలేదు. పప్పులో నెయ్యి యెరగడు. పులిహోర్లో కరివేపాకెరగడు. గోంగూరపచ్చట్లో ఎట్‌లీస్ట్ నీరుల్లిపాయ కాంబినేషనైనా యెరగడు? భగవంతుడు శెట్టిగారికి ఇంత ఐశ్వర్యం యిచ్చీకూడా తిండానికి నోరు ఇయ్యలేదు. బ్లడీ గాడ్! ఎంత విచారకరమయిన విషయం?

"దాన్నే" "పొదుపు" అని శ్లాఘిస్తారు మన పెద్దలు.

"పోనీ తను తినకపోతేపోయేడు. ఒకళ్లకి పెట్టడం అయినా వుందా? పిల్లికి భిక్షం వెయ్యని అపరదానకర్ణుడు. కళ్లూకాళ్లూ లేని వాళ్లు ఎవళ్లైనా గుమ్మందగ్గర "బాబయ్యా" అంటే కర్రపుచ్చుకుని కళ్లెర్రజేసి కరవబోయేవాడు శెట్టి. కరుణ అన్నది కోసిచూసినా కాయంలో ఎక్కడాలేదు. ఇంతెందుకు? అనుక్కూనీవాళ్లూ బీదవాళ్లూ ఆయనదృష్టిలో బ్రతకగూడదు. అంటే ఉండకూడదన్నమాట. వాళ్ళపాలిట ఆయన యముడు. ఏవో మహాపాపాలు ఇంతకుముందు జన్మల్లోనోచేసి ఆ పాపఫలితాన్ని ఇలా అనుభవిస్తున్నారు. దరిద్రగొట్టు వెధవలు? ప్రతీవెధవా అడుక్కోటమే? ఏం? పనిపాట్లు చేసుకోరాదూ? అంటూ తిట్టేవాడు. తను పూర్వజన్మలో ఏవేవో మహాపుణ్యకార్యాలు చేసి పుణ్యం సంపాదించబట్టే తనకీజన్మలో భగవంతుడు ఇంత అయిశ్వర్యం ఇచ్చాడన్న ధీమా ధ్వని

స్తూండగా శెట్టి, భగవంతుడు ఆయనకి ఇంత అయిశ్వర్యం ఇచ్చాడు. ఉండటానికి దివ్య భవనం యిచ్చాడు. బంగారం, వెండీ, మోయ లేనంత యిచ్చాడు. కాని వాడి తస్సాగొయ్యా? ఇన్నీ ఇచ్చి ఆ ఒక్కటీ కూడా యెందుకివ్వకూడదు? తనంటే శెట్టికి, భక్తీ భయమూకూడా. గుళ్లో శెట్టిగారి పేరుతో సహస్రనామ పూజలూ, అవీ జరుగుతూనే ఉన్నాయి. అన్నవరంకొండకి వెళ్లి సత్యనారాయణవ్రతం చేసి, డబ్బీలో అయిదు రూపాయలువేసి మొక్కుకున్నాడు గూడా, కాని, ఇన్నీ ఇచ్చి భగవంతుడు తనకి సంతాన యోగం ఇవ్వలేదు పాపం? దేవుడు ఎంత కఠినాత్ముడు?

పెళ్ళయి యిరవై సంవత్సరాలు దాటి పోయాయి, కాని ఏ ఆదర్శంతో అంతా పెళ్ళిచేసుకుంటారో, ఆ ఆదర్శంమాత్రం సిద్ధించలేదు. ఒక్క వంశవర్ధనుణ్ణి ఆ భగవంతుడు ప్రసాదించలేదు. ఆయోగం తనకులేదు కాబోలు? అనుకునేవాడు సుబ్బయ్య. ఇలా ఉంటూండగానే ఆప్రమాదం కూడా ఎవరూ అనుకోకుండా జరిగింది. ఉన్నట్టుండి శెట్టిగారిభార్య చిన్నజ్వరంతో మంచంపట్టి అదే యెక్కువై వారాలూ నెలలూ మంచంపట్టి ఆ మణుగుల బంగారాన్నంతా వదల్లేక వదల్లేక, ఈవెధవలోకంలో వదిలేసి, స్వర్గలోకం చేరుకొంది. ఆమహిళామతల్లి మరణానికి కంట తడిపెట్టని మహిళలెవరూ లేరా గ్రామంలో.

శెట్టిగుండె గుభేలుమంది, ఏడ్చాడుకూడా. ఇంత అన్యాయం జరుగుతుందని ఆతడు కలలోకూడా అనుకోలేదు. ఎందుకో భగవంతుడు తనమీద పగసాధిస్తున్నాడు. పోనీ! తనకేం కోరిక లున్నాయో చెప్పకూడదా? వెధవ! పంచదార కానేకానాలా? లేక కిర్సనాయిల్ టిన్లు కావాలా? ఏగ్లూకోస్ డబ్బాలన్నా కానాలా? కంట్రోలురేటుకేగాకుండా ఉట్టినేఇచ్చేసును. తనకేంకానాలో ఆగాడిద కొడుకు చెప్పకపోతే యెలా? చెప్పకపోతే తనకెలా తెలుస్తుంది? విచారంతో కొన్నాళ్లు మంచంపట్టాడు శెట్టిగారు. ఏదో ఎరిగున్న వాళ్లు నలుగురూ, చుట్టాలూ, పక్కాలూ వచ్చారు. ఓదార్చారు. ఇంతకీ ఇంత అయిశ్వర్యం ఉండి అనుభవించడానికి ఆమెకు యోగ్యత లేదన్నారు. సీత, సావిత్రి, అరుంధతి మొదలైన ఉత్తమసాధ్వీమణుల జాపితాలో ఆఖర్న మాణిక్యమ్మగారి పేరు కూడా చేర్చారు. అదంతా కర్మయోగం అని వేదాంతం బోధించారు. ధైర్యం వహించమనీ, వయస్సు ఇంకా చిన్నదే అనీ, ఇంకో సంబంధం యేదైనా చూసుకుని ఇల్లు నిలబెట్టమనీ, ఆడదిలేని ఇల్లు కలకలలాడదనీ బోధించారు. మళ్లీ పెళ్లిచేసుకుంటే సంతానయోగం ఉంటుందేమో? ఎలాగయినా పెళ్లిచేసుకోవడం శుభకరం. ఇహ పర సాధనం అన్నారు పెద్దలు. నిజమే? అయితే యాభైయ్యోపడిలో ఉన్న తనకి పిల్లనెవరిస్తారు? చూస్తూ, చూస్తూ యౌవనంలోఉన్న కన్యను, తనబోటి శక్తి ఉడికినవాడికి యేతండ్రి యిస్తాడు?

నిట్టూర్పు

ప్రణయమే ప్రమాదానికి దారితీస్తుంది. విరాగిని చేస్తుంది. త్యాగానికి ఉసిగొల్పుతుంది. ఈ నవలయందు స్త్రీ వలచినను పురుషుడు మిత్రునికై స్వార్థాన్ని గణించక త్యాగంచేయటం అపూర్వ విషయం. దానసుకొన్నట్టు, తన్ను ప్రేమించినయువతి తన ఇష్టానుసారం మిత్రుని వివాహమాడి సౌఖ్యాన్ననుభవించక పోవటంచూచి చింతకులోనై తను మరుగైపోవుట విషాదపరిణామం. ఇది పాశ్చాత్య నవలా పద్ధతి ననుసరించి రచింపబడినది. తెలుగులో ఇట్టి నవలారచన కిదే ప్రథమం. చదువుటలో మైమరపును గల్గించును.

వెల 0—8—0

కాని అలా ఇచ్చేవాళ్లు, అంటే డబ్బుకి తమతమ పిల్లల్ని అమ్ముకొనేవాళ్లు ఈ శతాబ్దంలోకూడా ఉన్నారని నిరూపించేలాగా, తనపిల్లనే ఇస్తానంటూ వచ్చాడు. ఆమధ్యనే వ్యాపారంలో దివాలాతీసిన ఓ నూటపదకొండు శెట్టిగారు. తనకూతుర్నిచ్చినట్లయితే అనంతరం వారసులు యెవరూ లేకపోవడం వల్ల అతని తదనంతరం ఆస్తిఅంతా తనకే దక్కుతుందన్న దురాశతో.

ఎలాగయితేనేం, పదహారేళ్ళయినా పూర్తిగా నిండని చక్కనిచుక్కలాంటి తన కూతుర్ని డబ్బుకాశించి సుబ్బయ్య శెట్టికి అమ్మేశాడాతండ్రి.

మంచి ముహూర్తంలో మహావైభవంగా శెట్టిగారి రెండోపెళ్ళి జరిగింది. చక్కని చుక్క. కాస్తోకూస్తో చదువూ సంస్కారం ఉంది బస్తీపిల్లకాబట్టి. శెట్టిగారివెంట ఆ పల్లెటూరొచ్చింది. పెద్దలంతా ఆశీర్వదించారు, సుపుత్రావాప్తిరస్తు అంటూ. "నవనవోల్లాస యువజనాళి"అంతా కన్నీరు పెట్టుకున్నారు ఆ లావణ్యరాశినిచూస్తూ.

క్రమంగా వారాలూ, నెలలూ సంవత్సరాలుకూడా అయిదు గడచాయ్. సెట్టిగారి వ్యాపారం యుద్ధం ఆరేళ్ళూ జనరల్ మెకార్థర్ సైన్యాలు పసిఫిక్ రంగంలో పరుగెత్తినట్లు పరుగెత్తింది.

ఆటంబాంబు దెబ్బకి, హిరోషిమా, నాగసాకీ, నగరాల్లో అసంఖ్యాకంగా రోడ్లమీద చచ్చిపడిన జపాన్‌వాళ్ళ మృతకళేబరాల్లాగా శెట్టిగారి మేడనిండా బియ్యపు బస్తాలూ, పంచదార బస్తాలూ గుట్టలుగుట్టలుగా పడివున్నాయ్. వ్యాపారం అంటే పాపం పెరిగినట్లు పెరిగిపోయింది. ఇంటినిండా అప్పట్లో ప్రజలకెవరికీ అందుబాటులోలేని సామగ్రులన్నీ, బెంగాల్ కరువులో పట్టెడన్నంకోసం అర్చిఅర్చి సొమ్మసిలి కలకత్తా రోడ్లమీద చచ్చిపడిపోయిన అభాగ్యుల మృతకళేబరాల్లాగా, చీకటిగదుల్లో పడి మూలుగుతున్నాయి. చక్కని చుక్కలాంటి పెళ్ళాం దొరికింది. అయిదేళ్ళనించి కాపరం చేస్తున్నాడు. ప్రపంచంలో యెన్నో మార్పులు వచ్చాయి. కాని శెట్టిగారికి మాత్రం ఆ యోగం లేకపోయింది. ఆయన కోరేదల్లా ఒక్కపుత్రుడు. అంతేకోరిక. అంతకన్న యేమీ లోటులేదు, ఏది కావలసినా ఆయన సంపాదించుకోగలడు. కాని ఇది మాత్రం చాలా దుర్లభంగా ఉంది.

ఎంతోడబ్బు ఖర్చుపెట్టి ఎన్నోమందులు కూడాతిన్నాడు. "మదనకామేశ్వరలేహ్యం, వీర్యస్తంభనరసాయనం మొదలైనవి. తన భార్యచేతగూడా యెన్నో పుత్రసంతానం

ప్రసాదించే అమృతాల్లాంటి బజారుమందులన్నీ తినిపించాడు. తనకు ఎంతమందో మహాత్ములు ఎన్నో రక్షరేకులుగూడా ఇచ్చారు. అయిదూ, పదీదొబ్బి, కాని ఇన్నీ ఉండికూడా ఆపత్సమయంలో అతనికి ఏమాత్రం ఉపకరించలేకపోయాయి. భార్య మాత్రం లోలోననే కుమిలి దుఃఖిస్తూ వీధంటపోయే అందమైన కుఱ్ఱాళ్ళకేసి ఆకలిగా చూస్తూ, జీవితాన్ని అలాగే లాక్కుపోతోంది ముళ్ళ కంచెలమీద. కొంతకాలంగడిచింది. భార్యాభర్తలమధ్య అంతగా పొత్తు లేకుండా పోయింది. ఎడముఖం? పెడముఖం క్రింద మారింది. తన మొదటిభార్య విడిచిపెట్టిపోయిన మణుగులాది బంగారంఅంతా పెట్టాడు. ఒక్కొక్కటి రెండువందలు పెట్టి యాభై సిల్కుచీరలు కొన్నాడు. తనేంకోరినా తెచ్చియిస్తున్నాడు. కాని తనంటే ఎందుకో ఆమెకా అసహ్యం? భార్య మౌనాన్నీ, అసహ్యభావాన్నీ చూసి శెట్టి తనలో తనే కుమిలి యేడ్చేవాడు.

* * *

క్రమంగా రెండోపెళ్ళిఅయి పది సంవత్సరాలు కావస్తోంది. యుద్ధం చల్లబడింది. లాభాలు కొంచెం తగ్గినా ఆగస్టు పదిహేనో తేదీతోటి (అంటే స్వరాజ్యం రాగానే) శెట్టిగారికీ స్వతంత్రం వచ్చింది. ఇక తను యెవడికీ భయపడ నక్కరలేదు. తెల్లవాడు పోయాడు. ఇక మనదే ప్రభుత్వం. మన మే ప్రభుత్వం. మన యిష్టంవచ్చినట్లు ప్రజల్ని దోచుకోవచ్చు. ఏమేనాఅంటే వెండిచెప్పుతో సాచిలెంపకాయ కొట్టవచ్చు. మనవాళ్ళేగా? దౌర్భాగ్యులు! దమ్మిడీయిస్తే వడుచుకునే రకాలు!

స్వరాజ్యం రావడంతోటే బ్లాక్‌మార్కెట్ పిశాచం, అధికార పిశాచం, లంచాల దెయ్యం, అక్కచెల్లెళ్ళు ముగ్గురూ దేశంమీద దండయాత్ర ప్రారంభించారు. కాస్త బుర్రవున్న ప్రతిపక్షిగాడూ, ధనదాహం, కీర్తిదాహం, అధికారదాహంతోటి అలమటించసాగాడు. ఆ ముగ్గురదే రాజ్యంగా మారింది. ఇంకేముంది? దాంతో వర్తకులదే స్వరాజ్యం అయి ఊరుకుంది. మహాత్ముని చిరతపఃఫలితం? ఈరీతిగా మన దౌర్భాగ్యులవల్ల పరిణమించింది! వందేమాతరం! ఎంత విచారకరమయిన పరిణామం? లాభాలు మళ్ళీ హెచ్చినాయ్. రేషనింగు ప్రవేశపెట్టింది ప్రభుత్వం. అదీ వర్తకుల పాలిట అదృష్టమే అయింది. అప్పుడే చరిత్రలోలేని కని, విని యెరుగని బ్లాక్‌మార్కెట్ అన్నపదం కొత్తగా తెలుగు నిఘంటువులో కెక్కింది.

శెట్టిగారికి అనర్ఘ సువర్ణరాసులు చూసుకుంటున్నకొద్దీ మతిపోతోంది. ఇదంతా ఎవడికోసం? తన అనంతరం యిదంతా అనుభవించే దెవరు? ఒక్క పుత్రరత్నాన్ని ప్రసాదించు ఓ ఏడుకొండలస్వామీ! నా బిడ్డ తోతూచి నీకు బంగారం యిస్తాను అని మ్రొక్కుకున్నాడు. కాని ఫలితం శూన్యం. కాలంమాత్రం శెట్టిగారికోసం ఆగలేదు. చూస్తుండగానే ఆయన తల తెల్లగా 'ముగ్గుబుట్టలా నెరిసిపోయింది.

ఇక లాభంలేదనుకున్నాడు శెట్టి. పోనీ! మంచి సాంప్రదాయంలోని కుఱ్ఱాణ్ణి యెవర్నేనా పెంచుకోమన్నారు పెద్దలు. ఆసలహా బాగానేవుంది. అదే దారిలావుంది?

మంచిరోజుచూసి దగ్గర పట్నంలో తన జ్ఞాతివాణ్ణే ఓ పక్షిగాణ్ణి తీసుకొచ్చి దత్తత చేసుకున్నాడు. కుఱ్ఱాడికి పన్నెండేళ్ళుంటాయి. ఇప్పటి బస్తీకుర్రకారులో కావలసిందానికల్లా మొఖంనాచి నరకం! వాణ్ణి తీసుకొచ్చి ఆప్యాయంతో పెంచసాగాడు శెట్టి.

క్రమంగా కుఱ్ఱాడికి యిరవైయేళ్ళు వచ్చాయి. శెట్టిగారికి బహుశా అరవై దాటిపోయాయి. ఆయన ముడ్డిమీద మూడుమూరల అంగోస్త్రంమటుక్కు ఆయన్ని వొదిలిపెట్టలేదు. శెట్టిగారు సరిగ్గా మసలటంలేదు. వ్యాపారం అంతా కుఱ్ఱాడికే అప్పగించారు.

కుఱ్ఱాడు అధికారంలోకొచ్చాడు. వ్యాపారం బందయింది. కొట్టు మూయించేశాడు. శెట్టియింట్లోని యినప్పెట్టిలో తుప్పుపట్టిన కాగితాలకట్టలన్నీ వీధులో పెంటమీద తుక్కులా ఎగిరాయి. కుఱ్ఱాడిపేరు రంగారావు. నిజంగా పూలరంగడే. రంగారావు పట్టింది ఆ దేవత. నెపోలియన్కీ, అలెగ్జాండర్కీ, హిట్లర్కీ, ఎడిసన్కీ మొదలైనవాళ్ళకందరికీ పట్టిన ఆ అదృష్టదేవత. ఆ దేవత తనను నమ్మి యిన్నాళ్ళనుంచీ ఆరాధించిన సుబ్బయ్యను తిరస్కరించి అరకప్పు కాఫీకీ, అల్లం పెసరట్టుకీ ముఖంవాచిన రంగణ్ణి వరించింది. ఊళ్ళో కాఫీహోటళ్ళలో, క్లబ్బుల్లో గ్రామ్లింగ్ పార్కులలో, సినీమా బుక్కింగ్ లలో, రెడీమేడ్ షాపుల్లో, వాచ్‌కంపెనీల్లో, మోటారు కంపెనీల్లో, వేశ్యాగృహాల్లో, పానశాలల్లో, సుబ్బయ్యశెట్టి యింట్లోని యినపెట్టిలో విస్తరాకులకట్టల్లాంటి కరెన్సీకట్టలన్నీ తందనాలాడాయి.

చేతికి ఫేవర్‌లూబావాచీ, కాళ్ళకు బూటూ, కళ్లకు నూరురూపాయలకు తక్కువగాని బంగారం అద్దాలూ, ఎప్పుడూ మడత నలగని బిన్నీ, కృష్ణా, ట్వీడ్ ఫారన్ మొదలైన రకరకాల సూట్లూ, ఎప్పుడూ తన్ను విడవని రాలీ సైకిల్, కూడా యెప్పుడూ అసంఖ్యాకులైన మిత్రశ్రీలూ, ఓ? రంగడు పూలరంగడైపోయి ఒక వెలుగు వెలుగించేయడం మొదలుపెట్టాడు.

సుబ్బయ్యశెట్టికి మతిపోయింది. మనోవ్యాధి పట్టుకుంది. తను నాలిక్కి పులుపు చేసుకోకుండా కడుపూ, నోరూ కట్టుకుని సంపాదించిన ధనంఅంతా కాలవకట్టి బజార్లో ప్రవహిస్తోంది. వారాలుచేసుకుని చదువుకునే బీదవిద్యార్థులు తన్ని అర్థించినా, ఎప్పుడూ తనవంతు పావలా డబ్బులు చందా యివ్వలేదు. ఆఖరికి తనకొట్టుమీదే నెల 1-కి 30 రూపాయల జీతంమీద బ్రతికే రామనాథం అయినా ఒక రూపాయి చందా యిచ్చేవాడుగాని! కొడుకుని నయాన్నీ భయాన్నీ చెప్పిచూశాడు. కాని లాభం లేకపోయింది. వినేరకంకాదు. తను మంచంమీదనుంచి లేవలేడు. శెట్టికీలోకం అంతా శూన్యంలా కనుపించింది. తనింతవరకూ ఏదయితే నమ్మాడో, ఏదయితే శాశ్వతం అనుకుని తత్సాధనకై జీవి

తం అంతా ధారపోశాడో, అదంతా వట్టి అశాశ్వతమనీ, అసలీజీవితమే ఏమీ సారం లేనిదనీ గ్రహించబోయేటప్పటికి, ఎందుకూ పనికిరాని తన 60 ఏళ్ల జీవితాన్ని ఒక్కసారి సింహావలోకనం చేసుకున్నాడు శెట్టిగారు. తానెందుకు పుట్టాడీభూమిమీద? పుట్టి ఏమేమి చేశాడు? ఏం అనుభవించాడు? ఏలక్ష్యంతో ఇంత ధనసంపాదనకి తన జీవితం ధారపోశాడు? పోనీ! తనజీవితంలో తానేం అనుభవించాడు? ఎవరికి యే యే ఉపకారాలు చేశాడు? ఊహు - తనీప్రపంచంలో జీవచ్ఛవం. ఉండి యేం లాభం? నెల్లాళ్ళనుంచి ఉబ్బసం, దగ్గు, ఆయాసంతో బాధపడుతున్నాడు. కొడుకు దగ్గరకయినా రావటం మానేశాడు. తానేమిటో? తన సినీమాలేమిటో? భార్యమాత్రం యిష్టంలేకపోయినా ఏదో విసుక్కుంటూ తప్పనిసరి కాబట్టి మందూ మాకూ కలిపిస్తూంది. క్రమంగా జబ్బుయెక్కువైంది. తను యెలాగా బ్రతకనని నిర్ధారణ చేసుకొన్నాడు. తనకు లోకజ్ఞానం వచ్చినప్పటినుంచీ, యిప్పటిదాగా, ధనసంపాదనా వ్యాపారం అంతా మొదటినుంచీ ఆఖరువరకూ సింహావలోకనం చేసుకున్నాడు. కాని యేమీ పరమార్థం కనబడలేదు.

పెద్దమనుష్యులసమక్షంలో ఏటా నాలుగు వేల రూపాయలు ఆదాయం వచ్చే భూములు భార్యపేర జీవితపర్యంతం అనుభవించడానికి రాసియిచ్చేశాడు. కారణం రేపు కొడుకు తల్లికి గంజికూడా పొయ్యడనే అనుమానం. అనంతరం శెట్టి మంచందిగడం మానేశాడు. క్రమంగా మానసికరోగంతోపాటు శరీరం కూడా పండిపోయింది గనక మరీ యెక్కువయింది. పోనీ! అప్పుడయినా దైవభక్తిగాని రామనామ స్మరణగాని, సత్కాలక్షేపంగాని చేశాడా? అబ్బే! అవేవీ శెట్టిగారికి అక్కర్లేకపోయాయి. తను ఏ యే పెట్లో ఎంత డబ్బు దాచిందీ, నోట్లుమీదా తాకట్టుమీదా యెంత యిచ్చిందీ, వడ్డీ ఎంత రావలసిందీ, ఎంత డబ్బు ఖర్చయిందీ. ఇదే ఆలోచన! ఒకవంక కొడుకు ఇల్లంతా గుల్లచేసేస్తున్నాడు. ఈరెండు ఆలోచనలూ బాగా ముదిరినాయి. కృశించిపోయాడు. నిరంతరం డబ్బునిగురించే ఆలోచన? ఈమధ్య తనకి వేళకి ఇంత అన్నంకూడా దొరకటంలేదు. భార్య తనమీద ఏమాత్రం అనురాగం చూపడం లేదు. కొడుకు అసలు కనబడడమే మానేశాడు. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంత ఆస్తిసంపాదించిన సుబ్బయ్యశెట్టికి అంత్యదశలో వేళకి ఇంతగంజికూడా దొరకలేదంటే మీరు ఆశ్చర్యపోతారు. ఎప్పుడు ఈశని విరగడైపోతుందన్నట్లుగా విసుక్కుంటూన్న భార్యనీ, తన విషయమే అక్కర్లేక ఆస్తినంతనీ దుర్వినియోగంచేస్తూ భోగం మాణిక్యంఇల్లే గతిగా తిరిగే కొడుకునీ తలుచుకుని, ఏడుస్తూ కృశించి కృశించి, ఆ మణుగుల బంగారాన్నీ, ఆ భార్యనీ, ఆ ఇనపపెట్టినీ చూసుకుంటూ, ఆ నాటిరాత్రి యమబాధపడ్డాడు శెట్టి. తెల్లవార్లూ నానాబాధాపడి తెల్లవారుఝామునే, ఇనప్పెట్టికేసి చూస్తూ, నాడబ్బు నాడబ్బు అంటూ లక్షలు విలువచేసే ఆస్తినీ, ఇంద్రభవనంలాంటి గృహాన్నీ, పసిమియౌవనంలోని పడుచుభార్యనీ, వదల్లేక వదల్లేక, యీలోకంలో వదిలేసి, అందరూ ధనికుడూ, పేదా, రాజూ, కూలీ, విద్వాంసుడూ, అక్షరశూన్యుడూ, కులవంతుడూ, కులహీనుడూ మొదలైన రకాల వ్యక్తులంతా యేలోకం అయితే తప్పనిసరిగా వెడతారో, యేలోకంలో ఐతే యీ భేదాలన్నీ ఉండవో, ఆ చిరశాంతిమయ లోకానికి చేరుకున్నాడు. పాపం! సుబ్బయ్యశెట్టి మరణానంతరం, కుమారుడు ఆపల్లెటూళ్ళో యింటికి తాళంవేసి బస్తీచేరుకున్నాడు భోగం మాణిక్యందగ్గరికి. భార్య పుట్టింటికి చక్కాపోయింది దక్కినవన్నీ దక్కించుకుని. ఒకానొకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఆ ఇల్లు, బిక్కుబిక్కుమంటూ, ఆ నూరు తాటాకులగుడిసెల్లో చిన్నబోయి కనుపిస్తూంటుంది. అందుకే గణించేది ఒకడూ గుణించేది ఒకడూ అంటారు లోకులు.


## జీవానందరసాయనము

ఊరుపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువలన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్భలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టిమాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తివిహీనమై దుర్భలమైన గుహ్యేదయమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకండరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు ఋతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

**ధనలక్ష్మి అండు కో., సౌకారుపేట పోస్టు, మదరాసు.**